# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

బుధవారం 16 ఏప్రిల్ 2025 www.prajaaswaramdaily.com 2 pm


### సురానా గ్రూప్ కంపెనీస్ చైర్మన్, డైరెక్టర్

## ఇళ్లల్లో సోదాలు

హైదరాబాద్ : హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు కలకలం రేపాయి. సురానా గ్రూప్స్ అధినేత నరేంద్ర సురానా ఇంట్లో ఈడీ అధికారులు(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) సోదాలు జరుపుతున్నారు. డైమండ్ పాయింట్లోని అరిహంత్ ఎంక్లేవ్‌లోని ఆయన నివాసం వద్ద ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఉదయం నాలుగు గంటల నుంచి నరేంద్ర సురానా ఇంట్లో సోదాలు చేస్తున్నట్లుగా తెలుస్తుంది. సోలార్ వ్యాపారంలో ఉన్న సూరనా గ్రూప్స్ మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించి సోదాలు నిర్వహిస్తున్నారు. చెన్నైలోని బ్యాంకుల నుంచి రుణాల చెల్లింపు ఎగవేతకు సంబంధించి సీబీఐ కేసు నమోదు చేసిన నేపథ్యంలో సోదాలు నిర్వహిస్తున్నారు.






### పైకప్పు పెచ్చులూడి పడి...

## చిన్నారికి గాయాలు

వికారాబాద్ : వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం మున్నూరు సోమారం ప్రాథమిక పాఠశాలలో పైకప్పు పెచ్చులు ఊడిపడి ఒకటో తరగతి విద్యార్థిని గాయపడింది. పాఠశాల పైకప్పు పెచ్చులూడి ఆరేళ్ల శిరీషకు తల, చెవి, కాళ్లకు గాయాలయ్యాయి. సకాలంలో స్పందించిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి పాపను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం పాపకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



# సిటీకి గ్రీన్ స్పేస్ అవసరం

## చెట్ల నరికివేతను సమర్థించుకోవద్దు

### సుప్రీం ఆగ్రహం

### విచారణ మే 15 కు వాయిదా

ఢిల్లీ : కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ అంశంపై బుధవారం జరుగుతున్న విచారణ సందర్భంగా.. "చెట్ల నరికివేతను సమర్థించుకోవద్దు" అంటూ జస్టిస్ బి. ఆర్.గవాయ్ వ్యాఖ్యానించారు. ఇక మరోవైపు ప్రభుత్వ పక్షాన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. విచారణలో.. నాశనం చేసిన వందల ఎకరాల అడవులను మీరు ఎలా పునరుద్ధరిస్తారు? అంటూ సుప్రీం కోర్టు ప్రశ్నించింది. పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీలకు తావులేదని స్పష్టం చేసింది. అలాగే మేము చూసిన వీడియోలు ఆందోళన కలిగించేలా ఉన్నాయని, అడవిలో నివసించే జంతువులు షెల్టర్ కోసం పరుగులు తీయగా, వీధుల్లో ఉండే కుక్కలు వాటిని కరిచాయని సమాచారం వచ్చింది అంటూ ఆవేదన వ్యక్తం చేసింది.

1996లో ఇచ్చిన తీర్పును విస్మరించి అధికారులు తమకు తాము మినహాయింపులు ఇచ్చుకుంటే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ప్రైవేట్ ఫారెస్ట్ లలో సైతం చెట్లను నరికితే అదే తీరు కొనసాగుతుందని, అటువంటి చర్యలను సీరియస్‌గా పరిగణిస్తామని పేర్కొంది. భూముల తాకట్టు అంశాలతో తమకు సంబంధం లేదని, నరికిన చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని ఆదేశించింది. డజన్ల బుల్డోజర్లతో వంద ఎకరాలలోని చెట్లను ఎందుకు తొలగించారు? ఇది ఎలా సరైన చర్య అవుతుందని ప్రశ్నించింది.

అభివృద్ధి అవసరమేనని, కానీ అది పర్యావరణాన్ని నాశనం చేసేలా ఉండకూడదని కోర్టు వ్యాఖ్యానించింది. సిటీకి గ్రీన్ లంగ్ స్పేస్ అవసరం. వన్యప్రాణుల రక్షణ కోసం మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? నాశనం చేసిన అడవులను ఎలా రీస్టోర్ చేస్తారో స్పష్టం చెయ్యండి... అంటూ కోర్టు ప్రశ్నించింది. చెట్ల నరికివేతకు ముందే అనుమతులు తీసుకోవాల్సింది అంటూ జస్టిస్ గవాయ్ హెచ్చరించారు. మొత్తంగా, చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూ.. పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది. ఈ అంశంపై తదుపరి విచారణను మే 15 కు వాయిదా వేసింది. అప్పటి వరకు 'స్టేటస్ కో' విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



# ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్

### మావోయిస్టు అగ్రనేతలు మృతి

చత్తీస్‌గఢ్ : చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భద్రతా దళాలు జరిపిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్రనేతలు ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారిద్దరిపై రూ.13లక్షల రివార్డ్ ఉంది. కొండగావ్-నారాయణ్‌పుర్ సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో మంగళవారం సాయంత్రం కొండగావ్‌కు చెందిన రిజర్వ్ గార్డ్, పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే ఎదురు కాల్పులు జరిగినట్లు బస్తర్ రేంజ్ ఐజీ పీ సుందర్‌రాజ్ తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో రెండు మృతదేహాలు, ఏకే-47 తుపాకీని బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతులు మావోయిస్టుల కమాండర్, తూర్పు బస్తర్ డివిజన్ సభ్యుడు హల్దార్, ఏరియా కమిటీ సభ్యుడు రమేగా గుర్తించినట్లు



చెప్పారు. హల్దార్, రమే తలలపై రూ.8 లక్షలు,రూ.5 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు చత్తీస్‌గఢ్‌లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 140 మంది మావోయిస్ట్‌లు మరణించారు. వారిలో నారాయణపుర్, కొండగావ్‌లతో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లోనే 123మంది ఉన్నారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసు..

## సిట్ విచారణకు శ్రవణ్ రావు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మరోసారి సిట్ విచారణకు శ్రవణ్ రావు హాజరయ్యారు. మరోసారి జూబ్లీహిల్స్ పీఎస్ కు చేరుకున్నారు. అయితే, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) కేంద్రంగా ఎవరెవరిపై నిఘా ఉంచాలనే విషయంలో శ్రవణ్ రావు సూచన మేరకే నిందితులు ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు తూ.చా తప్పకుండా అమలు చేశారని సిట్ అభియోగం మోపింది. కేసు నమోదైన వెంటనే విదేశాలకు పారిపోయిన శ్రవణ్ రావు మార్చి 29న ఎట్టకేలకు హైదరాబాద్ కు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల నుంచి సిట్ అధికారుల నోటీసులు అందుకున్న ఆయన ఇప్పటికే నాలుగు సార్లు విచారణకు హాజరయ్యారు. అయితే, ఈరోజు విచారణలో భాగంగా శ్రవణ్ రావు సబ్మిట్ చేసిన రెండు ఫోన్లలోని డేటాను అధికారులు రికవర్ చేసే పనిలో ఉన్నారు. అసలు ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు. అయితే ఆయన ఇచ్చే వాంగ్మూలం ఆధారంగా సిట్ అధికారులు పలువురు నేతలకు నోటీసులు ఇచ్చి వారిని కూడా విచారించే అవకాశాలు ఉన్నాయి.






### వైల్డ్ హార్ట్ పబ్బుపై

## పోలీసుల దాడులు

హైదరాబాద్ : నిబంధనలకు విరుద్ధంగా అసభ్యకరమైన నృత్యాలు ప్రదర్శిస్తున్నారనే సమాచారంతో....హైదరాబాద్ లోని వైల్డ్ హార్ట్ పబ్బుపై పోలీసులు దాడులు నిర్వహించారు. వినియోగదారులతో పాటు నృత్యాలు చేస్తున్న 16మంది యువతులను, డీజే ఆపరేటర్ ను అదుపులోకి తీసుకున్నట్లు చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్ రావు తెలిపారు. పబ్బు యజమాని యువతులను ఫ్రీ ఎంట్రీ పేరుతో ఎంగేజ్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ అమ్మాయిలను పబ్బుకు ఒంటరిగా వచ్చే యువకుల దగ్గరికి వెళ్లి వాళ్లతో అసభ్యంగా డాన్సులు చేయమని చెప్పి వాళ్లతో మందు తాగించుకొని బిల్లు అధికంగా అయ్యేలా చేసి కస్టమర్లను మోసం చేస్తున్నారని సీఐ వివరించారు.






### జపాన్ చేరుకున్న

## సీఎం రేవంత్

టోక్యో : ఎనిమిది రోజుల పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి జపాన్ చేరుకున్నారు. నిన్న రాత్రి హైదరాబాద్ నుంచి బయలు దేరిన బృందం.. ఈ రోజు మధ్యాహ్నం నారిటా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. ఈ నెల 22 వరకు జపాన్‌లో సీఎం బృందం పర్యటన కొనసాగనుంది. ఈ పర్యటనలో భాగంగా టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హిరోషిమాలో పర్యటించనున్నారు. అలాగే ఒసాకాలో జరిగే ఇండస్ట్రియల్ ఎక్స్‌పో లో సీఎం రేవంత్ పాల్గొననున్నారు. అనంతరం టోక్యోలో పెట్టుబడులపై పలు పారిశ్రామికవేత్తలతో సమావేశం జరగనుంది.

జపాన్ లోని కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ ఆధారిత అభివృద్ధిపై జపాన్ వెళ్లిన సీఎం బృందం అధ్యయనం చేయనుంది. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ కోసం జపాన్ సాంకేతిక అభివృద్ధిని అధ్యయనం చేయడంతో పాటు, అభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డి అక్కడి వ్యాపారవేత్తలను, వివిధ సంస్థలను ఆహ్వానించనున్నట్లు తెలుస్తుంది. ఈ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ఇతర అధికారులు ఉన్నారు.



## బ్యాక్ టు ద ఫ్యూచర్..

### ఖుష్బూ న్యూలుక్ పిక్స్ రిలీజ్

### రకరకాలుగా కామెంట్స్ చేసిన నెటిజన్లు

### ట్రోలర్స్‌పై మండిపడ్డ నటి

సినిమా : ఖుష్బూ తన న్యూలుక్ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అయితే, ఆమె చాలా సన్నగా కనిపించడంతో కొందరు నెటిజన్లు ట్రోలింగ్ చేయడం ప్రారంభించారు. దీనిపై ఆమె గట్టిగా బదులిచ్చారు. ఖుష్బూ తను షేర్ చేసిన ఫోటోలకు 'బ్యాక్ టు ద ఫ్యూచర్' అనే క్యాప్షన్ పెట్టారు. దీనిపై కొందరు నెటిజన్లు ఆమె సన్నబడిన తీరును ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం సన్నగా మారడానికి ఇంజెక్షన్స్ చేయించుకున్నారని, వాటి మాయ వల్లనే ఇలా మారిపోయారని, వాటి గురించి ఫాలోవర్స్‌కు కూడా చెప్పండి అంటూ రకరకాలుగా కామెంట్స్ పెట్టారు. ఈ కామెంట్స్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఖుష్బూ.. వారికి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. "మీరెటువంటి మనుషులు? మీరెప్పుడూ మీ ముఖాలను సోషల్ మీడియాలో పంచుకోరు. ఎందుకంటే మీరు అంత అసహ్యంగా ఉంటారు. మీ తల్లిదండ్రులను చూస్తుంటే జాలి వేస్తోంది" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

